# సెలవులో చిత్తూరు కలెక్టర్

**విశాలాంధ్ర -చిత్తూరు:** చిత్తూరు కలెక్టర్ ఎస్.షన్మోహన్ శుక్రవారం నుండి 10 వ తేదీ వరకు సెలవు పెట్టారు. కలెక్టర్ సెలవు పూర్తి అయ్యే వరకు జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు ఇన్‌చార్జి కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 11 నుండి కలెక్టర్ తిరిగి ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# సమాచార శాఖ మంత్రికి రాఖీ కట్టిన బ్రహ్మా కుమారీలు

**విశాలాంధ్ర - శ్రీకాళహస్తి :** నేటి గురువారం సాయంత్రం శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవాలయం చేరుకున్న రాష్ట్ర సమాచార శాఖ, వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రిచెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ కు ప్రజాపిత బ్రహ్మా కుమారీలు అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షా బంధన్ రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలిపారు. మంత్రి బ్రహ్మకుమారీలకు రాఖీ పౌర్ణమి శు భాకాంక్షలు తెలుపుతూ భగవంతుని ఆశీస్సులు వారికి మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరి తారక శ్రీనివాసులు ఉన్నారు.

# పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి: తహశీల్దారు

**విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ:** గిరిజనులు పౌర హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ భార్గవి తెలిపారు, మండలంలోని పల్ల మాల పంచాయతీలోని సుద్ద మిట్ట గిరిజన కాలనీలో గురువారం ప్రజలకు పౌర హక్కులపై అవగాహన నిర్వహించారు. గిరిజనులు తాగినీరు, పారిశుద్ధ్యం సమస్యలు తహశీల్దారుకి విన్నవించుకున్నారు, తహశీల్దారు ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడుతూ మీ ప్రశ్నలకు, సమస్యలకు అధికారులుగా పరిష్కార మార్గం చేస్తామన్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మీకు కల్పించిన హక్కులు పై ఎవరైనా ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు, కుల, మత, వర్ణభేదాలు లేకుండా ప్రతి ఒక్కరు ఐకమత్యం, సోదరి భావంతో ఉండాలన్నారు. దళిత, గిరిజనుల విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొస్తున్న వాటికి ఉపయోగించుకుని అభివృద్ధిలోకి రావాలని కోరారు. గిరిజన కాలనీలో ప్రజలందరూ ఐక్యతతో శాంతియుతంగా సమానత్వంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. గిరిజనులు భూ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యతోనే విలువలు పెరుగు తాయని పిల్లలకు మెరుగైన విద్య అందేలా తల్లిదండ్రులు బాధ్యతలు చేపట్టాలన్నారు. పిల్లల చదువులు మధ్యలోనే ఆపివేయకుండా వారిని ప్రోత్సహించి చదివిస్తే ఉన్నతమైన స్థాయికి వెళాతారన్నారు. రాజ్యాంగం కల్పిస్తున్న పౌర హక్కులపై పూర్తి అవగాహన కలుగుతుందని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, పల్లమాల పంచాయతీ సర్పంచ్ భర్త జొన్నల గోపాల్ రెడ్డి, తుమ్మూరు పెంచలయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పుష్ప పల్లకి పై ఊరేగిన ద్రౌపదిదేవి సమేత ధర్మరాజు

- చంద్రగిరి మహాభారతంకు డాలర్స్ దివాకర్ రెడ్డి లక్ష విరాళం

**విశాలాంధ్ర - చంద్రగిరి :** చంద్రగిరి మహాభారత ఉత్సవాల్లో సందర్భంగా గురువారం ద్రౌపది సమేత

ధర్మరాజుల స్వామి, పాండవులు (భీముడు, అర్జునుడు, నకులసహదేవులు) పుష్పపల్లకిపై ఊరేగారు. ఉత్సవాలకు డాలర్స్ గ్రూప్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. చంద్రగిరి మహాభారత ఉత్సవాలు గత 18 రోజులుగా ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాలలో చివరి రోజు ధర్మరాజ సమేత ద్రౌపది దేవి పుష్పపల్లకిపై ఊరేగారు. ఈఉత్సవానికి డాలర్స్ గ్రూప్ అధినేత ప్రముఖ పారిశ్రామికవేత్త డాలర్స్ దివాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా చంద్రగిరి కొత్తపేట అంకాలమ్మ ఆలయం నుంచి కుటుంబ సభ్యులతో మంగళ వాయిద్యాలు, మేళాతాళాలు, డప్పు మేళాల మధ్య దివాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి సారెను అభిమానుల మధ్య ర్యాలీగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో స్వామివారికి సారెను బహుకరించారు. అనంతరం స్వామి వారిని పుష్ప పల్లకి అలంకరించి చంద్రగిరి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త విరుపాక్షి శంకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# 2న నియోజకవర్గ స్థాయి షటిల్ పోటీలు



**విశాలాంధ్ర - గూడూరు :** ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీన నియోజక వర్గ స్థాయి షటిల్ బాడ్మింటన్ క్రీడా పోటీలను హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆ అసోసి యేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్. జమాలుల్లా, గాధంశెట్టి గిరిబాబు తెలిపారు. గురువారం సాయంత్రం వారు బజారు వీదిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో ఆరు విభాగాలలో షటిల్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అండర్ 13, అండర్ 15 బాలుర, బాలికల విభాగం, మెన్స్ డబుల్స్, తీన్ మార్ మెన్స్, తీన్ మార్ వెటరన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుండి మెన్స్ డబుల్స్ పోటీలు ప్రారంభిస్తామన్నారు. అలాగే ఆదివారం ఉదయం 8గంటల నుండి అండర్ 13, అండర్ 15 విభాగాలలో, తీన్ మార్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైజీఎస్బీఏ సభ్యులు కోదండపాణి, వల్లూరు రమేష్, ఉదయ్, కైకాల సునీల్ పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డిని కలిసిన మగ్దూమ్

**విశాలాంధ్ర - గూడూరు :** వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఎండీ. మగ్దూమ్ మొహిద్దీన్ గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మగ్దూమ్ గూడూరు నియోజకవర్గ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో వైసీపీలో బలమైన మైనారిటీ నారకులున్నారని, మరోసారి సీఎం జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. దీనికి స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మైనారిటీలకు కొండంత అండగా ఉంటారన్నారు. మగ్దూమ్ వెంట పలువురు వైసీపీ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- సామాన్య భక్తులకు పెద్దపీట
- బ్రహ్మోత్సవాలలో సిఫారసు లేఖలు నిరాకరణ
- చంటి బిడ్డల, వికలాంగ, వృద్ధుల దర్శనాలు రద్దు
- గరుడ సేవ నాడు ద్విచక్ర వాహనాల రాకపోకలు రద్దు
- జిల్లా యంత్రాంగంతో టీటీడీ ఈవో ధర్మారెడ్డి సమన్వయం

**విశాలాంధ్ర - తిరుమల :**అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జరిగే రెండు బ్రహ్మోత్సవాలకు విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశం ఉందని, భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నామని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం కలెక్టర్, ఎస్పీ, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్, టీటీడీలోని అన్నివిభాగాల అధికారులతో ఈవో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. సెప్టెంబరు 18న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా శ్రీనివాస సేతు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల హాస్టల్ భవనం, తిరుమలలో విశ్రాంతి గృహాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయన్నారు. గరుడసేవను రాత్రి 7 గంటలకు ప్రారంభించి భక్తులందరికీ దర్శనం కల్పిస్తూ ముందుకు తీసుకెళతామని తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని, వారికి సంతృప్తికరంగా వాహనసేవల దర్శనంతోపాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు స్వీకరించబోమని స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే అనుమతిస్తామని వివరించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలేజ్ దర్శనాలను రద్దు చేసినట్టు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మత్స్యకార ప్రాంతాల్లోని భక్తులకు రోజుకు వెయ్యి మంది చొప్పున బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తామని తెలిపారు. వీరికి ఉచితంగా రవాణా, భోజనం, బస కల్పిస్తామన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా సెప్టెంబరు 22న గరుడసేవ నాడు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేశామన్నారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు రవాణా, వైద్యం తదితర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాల కోసం విభాగాల వారీగా ప్రత్యేక ఏర్పాట్లు చేపడతామని చెప్పారు. భక్తుల కోసం పలు ప్రాంతాల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొమ్మిది రాష్ట్రాల నుండి కళాకారులను ఆహ్వానించి వాహనసేవల ఎదుట కళాప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని వివరించారు. వాహనసేవల ఎదుట ఏనుగులు, అశ్వాలు, వృషభాలు ప్రత్యేక అలంకరణలో పాల్గొంటాయని, వీటి నిర్వహణ కోసం కేరళ నుండి నిపుణులను రప్పిస్తున్నామని చెప్పారు. అటవీ శాఖ తిరిగి ఆదేశాలు జారీ చేసే వరకు నడక మార్గాల్లో ఇప్పుడున్న నిబంధనలు కొనసాగుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గతేడాది తరహాలోని జిల్లాలోని అన్ని విభాగాలను భాగస్వాములను చేసి శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. టీటీడీతో సమన్వయం కోసం నలుగురు అధికారులను ఇప్పటికే ఏర్పాటు చేశామని, ఎక్సైజ్ చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ట్యాక్సీలకు ధరలు నిర్ణయించి స్టిక్కర్లు అంటిస్తామని, రుయా ఆసుపత్రి, ఇతర ప్రాంతాల నుండి వైద్యులను, మందులను అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లా

డుతూ బ్రహ్మోత్సవాలకు తగినంత మంది సిబ్బం దితో పూర్తి భద్రత కల్పిస్తా మని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన, గరుడ సేవ, చక్ర స్నానం రోజుల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడతామన్నారు. శ్రీవారి ఆలయం, మాడ వీధులు, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు, అలిపిరి చెక్ పాయింట్ తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతా మన్నారు. భక్తుల రద్దీతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తిరుపతి నగరం శివార్లలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతిలోని రైల్వే స్టేషన్, బస్టాండు, భక్తులు సంచరించే అన్ని ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి మెరుగ్గా పారిశుద్ధ్య చర్యలు చేపడతామని తెలిపారు.మీడియా సమావేశంలో శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన వేణుగోపాల దీక్షితులు, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌వో నరసింహ కిషోర్, డిఎల్‌వో వీరరాజు, అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆర్టీసీ ఇన్‌చార్జి ఆర్ఎం జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# 18 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలి : జేసీ

**విశాలాంధ్ర -బైరెడ్డిపల్లె :** క్షేత్రస్థాయిలో జరుగుతున్న గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో కు సంబంధించి సర్వే పక్కద్బందీగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 18 సంవత్సరాల లోపు ఉన్న బడికి వెళ్లాల్సిన పిల్లలు బయట ఉండకూడదని చిత్తూరు జేసీ పి. శ్రీనివాసులు అన్నారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ బైరెడ్డిపల్లి మండలం కడప నత్తం గ్రామంలో సర్వే గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో మొత్తం 132 మంది విద్యార్థులు పాఠశాలకు వెళు న్నారని ముగ్గురు మాత్రం వెళ్లడం లేదని తెలిపారు. అందులో ఒకరు మధ్యలో బడి మానివేశారని వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వారితో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వారు ఇంటి వద్ద ఉండకూడదని పాఠశాలకు తప్పనిసరిగా వారు వెళ్లేటట్లు చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. గ్రామంలోని మిగతా వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహించారని, సచివాలయ సిబ్బంది ఏవిధంగా పరిశీలించారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. సి ఆర్ ఎ యాప్ లో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని ఈ సందర్భంగా వాలంటీర్లు సచివాలయ సిబ్బంది జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఖచ్చితమైన వివరాలను పొందుపరచాలని లేకుంటే ఈ యాప్ లో సమస్యలు రావడం జరుగుతుందని ఎస్ ఎస్ సి ఎ పి ఓ వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ శివయ్య, తహశీల్దార్ కుమారస్వామి , ఎంఈఓ సాయి లీల,సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ

**విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ :** పుత్తూరు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకటేశు, జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 2014 ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి గద్దినెక్కారు కానీ ఆచరణలో సంవత్సరానికి కనీసం రెండు లక్షల ఉద్యోగులు కూడా కల్పించకపోవడం సిగ్గుచేటు అన్నారు. 2017, 18లో నాలుగు శాతం కన్నా నిరుద్యోగం 2022లో ఏడు శాతానికి పైగా పెరిగిందన్నారు. ఈ నాలుగు సంవత్సరాలు కాలంలో ఒక కోటి 50 లక్షల మంది కార్మిక ఉద్యోగులు కోల్పోయారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు పేదలకు ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వామపక్షాల కృషితో సాధించారన్నారు. ఈ పథకానికి నిధులు క్రమంగా తగ్గించి ఎత్యాయని ప్రయత్నించడం తరుణమన్నారు. ఈ సంవత్సర బడ్జెట్లో 30 వేల కోట్ల రూపాయలు కార్పొరేట్లకు బడా పెట్టుబడుదారులకు రాయితీనిచ్చిందని ఆరోపించారు. దళిత గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులు లక్షల సంఖ్యలో ఉన్న ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలు ప్రజల పైన బారాల మోపుతున్నారని అందుకు నాలుగవ తేదీ జరిగే పుత్తూరు మండలంలో తహశీల్దార్ ఆఫీస్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ విజయ్, కె. బి.ఆర్.పురం వెంకటేష్, శివ హరీష పాల్గొన్నారు.

# అనాథ వృద్ధులకు ఆర్డీఓ ఆపన్న హస్తం

అనాథ ఆశ్రమానికి పది బస్తాల బియ్యం పంపిణీ

**విశాలాంధ్ర - గూడూరు :** గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ లోని వృద్ధులు, చారిటబుల్ ట్రస్ట్ యాజమాన్యం ఆర్డీఓ కిరణ్ కుమార్ ను అభినందించారు.కష్టాల్లో ఉన్నారని తెలిస్తే ముందువెనుక ఆలోచించకుండా సాయం చేసే గొప్పగుణం గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ కు ఉందనే చెప్పుకోవాలి. ఎవరికీ ఏ ఆపదొచ్చినా. ఆదుకుంటూ వారికి అండగా నిలుస్తూ పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ గూడూరు నియోజకవర్గ ప్రజల చేత శభాష్ ఆర్డీవో కిరణ్ కుమార్ అనిపించుకుంటున్నారు. గురువారం గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ మరో దాతృత్వం చాటుకున్నారు. గురువారం గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ లోని వృద్ధులకు ఒక నెలకు సరిపడా పది బియ్యం బస్తాలు, నెలకు సరిపడా కూరగాయలు అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. సెప్టెంబర్ నెలలో వృద్ధుల కాలక్షేపానికి ఎల్ఈడి టీవీని ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ కి అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోఎటువంటి సహాయం లేక నిరాశ్రయులైన వృద్ధులకు, అనాథ బాలలకు ఆర్థిక అభివృద్ధి సాధించిన ప్రతిఒక్కరూ తమ వంతు ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. వికలాంగులకు కూడా విద్య, వైద్య, ఆహార, ఆర్థిక పరంగా సహాయం చేసేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. సాయం కోసం ఎదురుచూసే వీరికి మానవత్వంతో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిరాశ్రయులకు, అనాథ వృద్ధులకు మనకు ఉన్నంతలోనే సహాయం చేస్తూ ఆసరాగా నిలుద్దామని గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ అన్నారు. ఈ నెల 19వ తేదీన మా మాతృమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశామన్నారు. గూడూరులో ఆర్డీఓగా ఉన్నంత కాలం చారిటబుల్ ట్రస్ట్ లోని వృద్ధులకు అండగా ఉంటూ తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆశ్రమంలో వృద్ధులను చూసినప్పుడు తల్లిదండ్రులు విలువ ఎంతో నేను గుర్తించానని తెలిపారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులను చలించి సొంత ఖర్చులతో ఏదో ఒక విధంగా నా వంతు సాయం అందించాలని అనుకున్నానున్నారు. ఆ క్రమంలో ప్రతినెల పది బియ్యం బస్తాలు అందించేందుకు నేను చేయూతనిస్తున్నానని ఆశ్రమం నిర్వాహకులకు భరోసా ఇచ్చారు.

# 7న ఎస్వి గోసంరక్షణ శాలలో గోకులాష్టమి వేడుకలు

**విశాలాంధ్ర- తిరుపతి:** శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో సెప్టెంబరు 7వ తేదీన గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గోసంరక్షణశాలలో గోపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు. టీటీడీ హిందువుల అతి ముఖ్యమైన పండుగలలో ఒకటైన జన్మాష్టమి వేడుకలను తిరుపతిలో ప్రతి ఏడాదీ అత్యంత ఘనంగా నిర్వహిస్తోంది. శ్రీ కృష్ణగోలోకాన్ని తలపించే విధంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లను చేయనుంది. భారీగా పందిళ్ళు, మామిడితోరణాలు, పూలమాలలతో అలంకారాలు చేపట్టనుంది. గోశాలలోని గోసంపదను అందంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సందర్శకులు గోశాలలో బెల్లం, బియ్యం, గోమాతలకు భక్తులు స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. గోవుకు మేతదానం చేస్తే మహాపుణ్య ఫలమని భక్తుల నమ్మకం. టీటీడీ సందర్శకులకు గోశాలలోని గోవులకు గ్రాసాన్ని అందించి గోమాత, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. గోకులాష్టమి సందర్భంగా ఎస్వీ గోసంరక్షణశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు వేణుగోపాలస్వామి వారికి అభిషేకం, ఉదయం 6 గంటలకు వేణుగానం, ఉదయం 7.30 గంటలకు వేద పఠనం, ఉదయం 7.30 గంటలకు దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటలకు వేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం వేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు.సాయంత్రం 6 గంటలకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ కార్యక్రమం నిర్వహించనున్నారు.

# లోకేష్‌కు రాఖీ కట్టిన చక్రాల ఉష

**విశాలాంధ్ర - శ్రీకాళహస్తి :** రాఖీ పండుగను పురస్కరించుకొని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు చక్రాల ఉష రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నారా లోకేష్ తల్లి భువనేశ్వరి, కుటుంబ సభ్యులు, పార్లమెంట్ అధ్యక్షు రాళ్ల మధ్య రాఖీ పౌర్ణమి వేడుకలు నారా లోకేష్ కి తెలుగు మహిళా అధ్యక్షురాళ్ళు తిరుపతి నుండి చక్రాల ఉష రాఖీ కట్టారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలుగు మహిళల సేవలు అభినందనీయమని తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రాష్ట్రంలోని 25 పార్లమెంటు తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాళ్లను ప్రస్తుతం యువగళం పాదయాత్ర జరుగుతున్న జంగారెడ్డిగూడెం వద్దకు ఆహ్వానించారు. అక్కడ తెలుగు మహిళా పార్లమెంటు అధ్యక్షురాళ్లు అందరూ నారా లోకేష్ కు రాఖీ కట్టారు. రాఖీ కట్టిన తెలుగు మహిళలు అందరికీ నారా లోకేష్ పట్టు చీర, రవిక, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. వారందరి ఆశీర్వాదం ఆయన తీసుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ నిర్బంధాల మధ్య తెలుగు మహిళలు చేస్తున్న పోరాటాలను వర్ణించడానికి అక్షరాలు చాలవన్నారు. వైసీపీ ప్రభుత్వం తెలుగు మహిళలపై అక్రమ కేసులు బనాయించడం, మానసికంగా వేధించడం చేసినా ఏమాత్రం వెనుకంజ వేయకుండా పోరాట పటిమ కనబరుస్తున్నారని నారా లోకేష్ కొనియాడారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరిగిన సమయంలో ప్రభుత్వం స్పందించే విధంగా తెలుగు మహిళలు పోరాటం చేస్తున్నారన్నారు. తెలుగు మహిళల పోరాటం ఇతరులకు స్ఫూర్తిగా ఉంటోందన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మహానాడులో ప్రకటించిన 'మహాశక్తి' పథకం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తెలుగు మహిళలు పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న తెలుగు మహిళలకు భవిష్యత్తులో మంచి గుర్తింపు ఇస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగు మహిళలకు మంచి ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించడానికి తెలుగు మహిళలు కీలక పాత్ర పోషించాలని నారా లోకేష్ కోరుకున్నారు. ఇందుకు తెలుగు మహిళలు అందరూ అంగీకరించారు. టీడీపీని అధికారంలోకి తెస్తామని శపథం చేశారు.

# టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో పులివర్తి నాని

**విశాలాంధ్ర - చంద్రగిరి :** రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ శ్రేణులకు టిడిపి చిత్తూరు పార్లమెంటు అధ్య క్షులు చంద్రగిరి నియో జకవర్గ ఇన్చార్జ్ పులివర్తి నాని పిలుపు నిచ్చారు. పులివర్తి నాని అధ్యక్షతన చంద్రగిరి ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై దిశా నిర్దేశం చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హరింప చేసేందుకు ఓటర్ల జాబితా పై రాజకీయ దొంగలు పడుతున్నారని, ఓటర్లు అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు పొందగలిగే హక్కును రాజ్యాంగం కల్పించిందని ఓటర్ లిస్ట్ లో ఓట్లు ఉన్న ఓటర్లు కూడా తమ ఓట్లు ఉన్నాయా? లేదా ? పరిశీలించుకోవాలన్నారు. ఎందుకంటే రాజకీయ పార్టీలకు చెందిన కొంతమంది వ్యక్తులు ఫారం 7 ద్వారా ఓట్లను తొలగించే కార్యక్రమం చేస్తున్నారన్నారు. రాజకీయ పార్టీ నాయకులరా చేతనైతే అర్హులైన వారికి ఓటు హక్కును కల్పించండి కానీ బ్రతికి ఉన్న వారిని కూడా చనిపోయారని గ్రామంలో నివాసాలు ఉన్నా లేరని ఫారం7 ద్వారా ఓట్లు తొలగించడానికి ముమ్మర ప్రయత్నాలు చేయడం సమంజసం కాదని హెచ్చరిం చారు. గ్రామాలలో బిఎల్వోలు కూడా ఫారం7 సమగ్రంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ ఒత్తుళ్లకు లోనై ఓట్లు తొలగిస్తే ఓటర్లు మీ ఉద్యోగాలను కూడా ఊడదీస్తారని హెచ్చరించారు. తర్వాత మీరు ఇబ్బందులు పడక తప్పదని హెచ్చరించారు. ఫారం7 ఫారం 6 లను క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటే మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్ చార్జిలు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆక్వా ఫీడ్ దుకాణాల తనిఖీ

- అనుమతి లేని ఫీడ్ల గుర్తింపు - అపరాధరుసుము విధింపు

**విశాలాంధ్ర-చిల్లకూరు:** తిరుపతి జిల్లా మత్స్యశాఖాధికారి ఆదేశాలు మేరకు చిల్లకూరులోని ఆక్వా ఫీడ్ అంగళ్ళు తనిఖీ చేసి అనుమతులు లేని ఫీడ్ శాంపిల్సు గుర్తించి, వాటికి 25 వేల రూపాయలు అపరాధ రుసుం జరిమానా విధించామని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రఘు గురువారం తెలిపారు.

# సజ్జల భార్గవ్ రెడ్డిని కలసిన ఈదా రత్నశ్రీ

**విశాలాంధ్ర - నాయుడుపేట:** వైసీపీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ రెడ్డిని వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఈదా రత్నశ్రీ అమరావతి లో రాఖీ పండగ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా భార్గవ్ రెడ్డికి ఆమె రాఖీ కట్టి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# సంఘటిత కృషితో భారతదేశం అభివృద్ధి

**విశాలాంధ్ర- నాయుడుపేట :** అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాకారం చేసుకునే దిశగా ప్రజలందరూ సంఘటితంగా కృషి చేయాలని,అన్ని చేతులు కలిస్తేనే ఆత్మనిర్భరతతో కూడిన అభివృద్ధి భారతం సాధ్యమౌతుందని మేరీ మాటీ - మేరా దేశ్ (నా భూమి - నా దేశం) ముగింపు కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం - నెల్లూరు ఆధ్వర్యంలో, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి ఐ.ఐ.ఎస్ నిర్దేశకత్వంలో నాయుడుపేట రూరల్ మండలం పూడేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నా భూమి - నాదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, గ్రామ సర్పంచ్ శాంతమ్మ, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి,గూడూరు డివిజన్ విద్యాధికారి శివ ప్రకాష్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి వెంకట శివ ప్రసాద్,మండల విద్యాధికారి బి.మునిరత్నం,పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు గోవర్ధన్ రెడ్డి, సబ్ ఇన్స్ పెక్టర్ టి.సి. కృష్ణయ్య, మెడికల్ ఆఫీసర్ శంకరయ్య, సి.డి.పి.వో. ఉమామహేశ్వరి,ఎ.పి.ఎం. ప్రసన్న, హెడ్ మాస్టర్ ఎస్.కె.ఇస్మాయిల్ సహా పలు వురు గ్రామ, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు జాతీయ జెండాలతో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. సభావేదిక నుంచి పంచ ప్రాణ్ ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల అవగాహన అంశాల కరపత్రం ను విడుదల చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఐ.సి.డి.ఎస్ వారు పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. మండల ఆరోగ్య విభాగం వారు విద్యార్థులకు ఆరోగ్య అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిని అక్షర భరత నాట్య ప్రదర్శన విశేషకంగా ఆకట్టుకుంది.పాఠశాల పదోతరగతి విద్యా ర్థులు తయారు చేసిన చంద్రయాన్-3 రోవర్ నమూనా విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. భారత ప్రభుత్వం తమ గ్రామాన్ని ఎంపిక చేసి నా భూమి - నాదేశం కార్యక్రమం నిర్వహించటం పట్ల భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్య క్రమం ద్వారా దేశమంతా గ్రామాల వైపు చూస్తోందని, ఇదో చక్కని పరిణామమని ఆమెతెలిపారు. దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు చక్కని అవకాశాలు అందిస్తోందని,ఈ నేపథ్యంలో చదువు కున్న ఆడపిల్లలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని,దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగిం చుకోవాలని సూచిం చారు.నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక మాట్లా డుతూ గ్రామీణ భారతం అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు అవుతుందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ నా భూమి - నా దేశం లాంటి కార్యక్రమాల ద్వారా గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వటం ఆనందదాయకమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకున్నప్పుడే ఆయా పథకాలకు నిజమైన ప్రయోజనం లభిస్తుందన్నారు.చదువుకున్న యువత గ్రామీణ ప్రజలకు ఈ పథకాలను చేరవేయటంలో అధికారులకు,ప్రజా ప్రతి

నిధులకు సహకరించాలని సూచించారు. గూడురు డివిజన్ విద్యాధికారి శివ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, భారత పౌరులంతా దేశభక్తిని అలవరుచుకోవాలన్న సంకల్పంతో భారత ప్రభుత్వం నా భూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించటం ఆనంద దాయకమని తెలిపారు.ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించటం ఆనందించదగిన అంశమన్నారు.ఆయన,విద్యార్థులుబాగా చదువుకుని పెద్దల పట్ల,దేశం పట్ల గౌరవ భావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ భారత ప్రభుత్వ నిర్వహిస్తున్న మేరీ మాటీ, మేరా దేశ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సూచించిన పంచ ప్రాణ్ ప్రతిజ్ఞను ప్రతి ఒక్కరూ తీసుకుని,అదే స్ఫూర్తితో అభివృద్ధి చెందిన భారతదేశం నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్ర మానికి సహకారం అందించిన మండల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

## ఏనుగు దాడిలో మరో మహిళ మృతి
### ఆపరేషన్ గజ విజయవంతం

**విశాలాంధ్ర -చిత్తూరు:** చిత్తూరు జిల్లా తమిళనాడు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు దాడిలో గురువారం మరో మహిళ మృతి చెందింది. గత రెండు రోజులుగా చిత్తూరు తమిళనాడు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో సంచరిస్తూ బీభత్సం సృష్టిస్తున్న ఒంటరి ఎనుగును బంధించడానికి అటవీ శాఖ అధికారులు చేపట్టిన ఆపరేషన్ గజ గురువారం సాయంత్రం విజయవంతమైంది. బుధవారం చిత్తూరు జిల్లా 190 రామాపురం వద్ద ఒంటరి ఏనుగు దాడిలో భార్యాభర్తలు మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా గురువారం తమిళనాడు రాష్ట్రం జోడినత్తం గ్రామం వద్ద ఈ ఒంటరి ఏనుగు దాడిలో వసంత అనే మహిళ మృతి చెందింది. దీంతో చిత్తూరు జిల్లా తమిళనాడు సరిహద్దు అటవీ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఈ పరిసర ప్రాంతాల్లో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. అయితే అటవీశాఖ అధికారులు ఒంటరి ఏనుగును బంధించడానికి చేపట్టిన ఆపరేషన్ గజ విజయవంతం అయింది. గురువారం సాయంత్రం అటవీ శాఖ అధికారులు చాకచక్యంగా 190 రామాపురం అటవీ సరిహద్దు ప్రాంతంలో సంచరిస్తున్న ఒంటరి ఏనుగుకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి బంధించారు. అనంతరం అడవి ప్రాంతంలో వదిలే ప్రయత్నం చేపట్టారు. దీంతో చిత్తూరు తమిళనాడు అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**విశాలాంధ్ర-పలమనేరు :** స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్ పర్సన్ పవిత్ర అధ్యక్షతన మున్సిపల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఇందులో అజెండాలోని 9 అంశాలు కౌన్సిల్ ఆమోదం కోసం తెలపగా 8 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఇందులో 9వ అంశం ను పెండింగ్‌లో ఉంచారు. ప్రధానంగా లేఅవుట్ లోని సమస్యలు శ్యాంసుందర్ రాజ్ గత కౌన్సిల్ సమావేశంలోనే తెలిపారు. వాటిని ఇంత వరకు అధికారులు పరిష్కరించకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డురు కాలనీలోని అక్రమ లేఔట్‌పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని ఆక్రమణలు తొలగించాలని కౌన్సిలర్ నాగరాజ్ డిమాండ్ చేశారు.

## రెండవ రోజుకు పెన్ డౌన్

**విశాలాంధ్ర- పలమనేరు :** ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఆదేశాల ప్రకారం 30,31 తేదీల్లో పలమనేరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో దస్తావేజు లేఖర్లు తరపున చేపట్టిన రెండు రోజులు పెన్ డౌన్ గురువారం కూడా కొనసాగింది. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 2.0 సాఫ్ట్‌వేర్‌కు వ్యతిరేకంగా, తమ జీవనోపాధికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా పాత విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నామన్నారు.

## ఘనంగా యువగళం విజయోత్సవ సంబరాలు

**విశాలాంధ్ర-పలమనేరు :** యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని పలమనేరులో ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ర్యాలీగా పలమనేరు మార్కెట్ యార్డ్ వద్దకు చేరుకుని అన్నా క్యాంటీన్ ఎదుట భారీగా బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా పూలు, టమోటాలతో ఏర్పాటు చేసిన యువగళం ఆర్ట్ పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలమనేరు పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు మాట్లాడుతూ నారా లోకేష్‌పై విమర్శలు చేసిన విపక్షాలు నోరెళ్ల బెట్టుకొనేలా యువనేత పాదయాత్రను కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలందరి అభిమానంతో అన్ని వర్గాల వారి ఆదరణతో యువగళం దిగ్విజయంగా సాగుతోందని భవిష్యత్తులోనూ నిర్విరామంగా కొనసాగేలా ఆ భగవంతుని ఆశీస్సులు వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్ర నాయుడు, ఆర్ బీసి కుట్టి, సుబ్రమణ్యం గౌడ్, నాగరాజు, నాగభూషణం, నాగి రెడ్డి, అమరనాథ రెడ్డి, నాగరాజు రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆనంద, ఈశ్వర్, చలపతి, సుధాకర్, మురళి, వెంకట ముని రెడ్డి, లోకేష్ వెంకటరమణ పాల్గొన్నారు.

## కుక్కల బెడద నుండి కాపాడండి..
### మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం

**విశాలాంధ్ర - పుంగనూరు:** కుక్కల బెడద అధికంగా వుందని దీనిపై అధికారులు దృష్టి సారించి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. పుంగనూరు పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ హలీం బాషా అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యురాలు రెడ్డెమ్మ మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదం మేరకు సమావేశం దృష్టికి తెలిపిన అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నామన్నారు. పట్టణ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని కుక్కల కాటు తో అనేకమంది గాయాలు పాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని సూచించారు. అగ్ని క్షత్రియ కులాల వారికి గతంలో ప్రత్యేక కుల ధ్రువీకరణ పత్రాలు అందించే వారిని ఇప్పుడు వారికి ఇవ్వడం లేదన్నారు ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి ఈ సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నామన్నారు. కౌన్సిల్ సభ్యులు షావలి హర్షద్ అలీ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా తన వార్డు పరిధిలో అనేక రోడ్లు గుంతలమై ఉండేవన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వార్డుబాటులో వీటిని పరిశీలించిన వెంటనే వార్డుబాట జరిగిన మరుసటి రోజే రోడ్లన్నీ ఏకకాలంలో పూర్తి చేశారన్నారు. ఆయనకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. వార్డు పరిధిలో పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి సాధించాలని సూచించారు. దోమల బెడద వల్ల ప్రజలకు నిద్ర లేకుండా పోతోందని పేర్కొన్నారు . అనంతరం మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాష మాట్లాడుతూ సభ్యులు తెలిపిన అన్ని అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వార్డుల అభివృద్ధి కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రూ.20 కోట్ల ప్రత్యేక నిధులను సమ కూర్చారన్నారు. ఈ నిధుల ద్వారా 31 వార్డులలో ప్రజలకు అవసరమైన అన్ని పనులు చేస్తామని తెలిపారు. పట్టణ ప్రాంతంలో ఎక్కడా వాటర్ సమస్య లేకుండా తాగునీటి పైపులైను వేయడంతో పాటు మురుగునీటి కాలువలు ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలు, రోడ్లు అన్ని ఎప్పటి కప్పుడు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. అన్ని చేస్తున్న మన నాయకుల గెలుపు కోసం అందరూ ఏకతాటిపై ఇప్పటి నుండే సమన్వయం చేసుకుని మంచి మెజార్టీ సాధించే విధంగా ముందుకు వెళ్లాలని కోరారు.

## పాఠ్యాంశాలు సులభరీతిలో బోధించాలి

**విశాలాంధ్ర -పులిచెర్ల కల్లూరు:** పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధన సులభ రీతిలో ఉండాలని ఎంఈఓ సిద్ధరామయ్య అన్నారు. పులిచెర్ల మండలం ఎల్లంకి వారి పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం క్లస్టర్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పాఠ్యాంశాల బోధన పూర్తి చేయాలని విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్ ఫోన్ తీసుకుపోరాదని అన్నారు. పాఠ్యాంశాల బోధనపై పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -2 పోకల తాతయ్య, హెచ్ఎం హరిశంకర్, సిఆర్ పి మునీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీఐ

**విశాలాంధ్ర - పుంగనూరు:** పట్టణం లోని ఎంబిటీ రోడ్ చౌడేపల్లి రోడ్డు లో అర్బన్ సీఐ తన సిబ్బందితో కలిసి గురువారం రోజున ట్రాఫిక్ నిబంధ నలపై పర్యటించారని రోడ్డుకు ఇరు వైపులా ఉన్న వ్యాపారస్తులతో మాట్లా డుతూ ట్రాఫిక్ నిబంధనలు మేర కు ప్రతి దుకాణదారుడు నడుచుకోవాలని సూచిం చారు. ఇష్టమొచ్చినట్లు రోడ్డు పైనే వ్యాపార కార్యక లాపాలు జరిపితే వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని దీనివల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. స్వచ్ఛందంగా ప్రజలంతా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పనిసరిగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## బైపాస్ రోడ్డు ఏర్పాటుకు అభ్యంతరాలు పరిశీలిస్తాం: జేసీ

**విశాలాంధ్ర - బైరెడ్డిపల్లె :** జాతీయ రహదారి 219 విస్తరణకు సంబంధించి భూసేకరణ కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని ఈ కార్యక్రమంలో ఎవరికి ఎటువంటి అన్యాయం జరగకుండా చూస్తామని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. జాతీయ రహదారి విస్తరణకుసంబంధించి అలైన్ మెంట్ లో మార్పులు కావాలని అందుకుసంబంధించి పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో బైరెడ్డిపల్లితహసీల్దార్ కార్యాలయంలో భూములుకోల్పోనున్న రైతులతో సమావేశం ను బైరెడ్డి పల్లి తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 219 జాతీయ రహదారికి సంబంధించి విస్తరణ కార్యక్రమం చేపట్టనున్నారని, జాతీయ రహదారుల వారు నిర్ణయించిన మేరకు పలు మ్యాప్ లను పరిశీలించారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపామని జాతీయ అధికారులు జేసీకి వివరించారు. ఎవరికి అన్యాయం జరగకుండా చూస్తామని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అన్నారు. ప్రతిపాదనలు పంపిన స్థలం ను అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తో పాటు జాతీయ రహదారుల అధికారులు అబ్దుల్ సలాం, సాయిరాం, పలమనేరు ఆర్ డిఓశివయ్య, తహశీల్దార్ కుమార స్వామి పాల్గొన్నారు.

## ధనంజయ రెడ్డిని సత్కరించిన మంత్రి

**విశాలాంధ్ర - కార్వేటినగరం :** పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఎర్రమరాజు పల్లి మాజీ ఎంపిటిసి జిల్లా వైసీపీ కోశాధికారిగా నియమితులైన పుత్తూరు ధనంజయ రెడ్డిని మంత్రి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పుత్తూరు ధనంజయ రెడ్డి మాట్లాడుతూ పదవి వచ్చినందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు భరత్‌కు, డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ధనంజ రెడ్డికి కోశాధికారిగా పదవి రావడం పై వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జీడినెల్లూరు నియోజకవర్గంలో నారాయణ స్వామిని ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిపించడానికి ఓటరు సిద్ధంగా ఉన్నారని ఇందుకోసం ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

## యువగళం పాదయాత్ర కు మద్దతుగా విజయోత్సవ ర్యాలీ

**విశాలాంధ్ర - కుప్పం :** నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతంగా 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కుప్పం నేతలు మద్దతు విజయోత్సవ ర్యాలీని నిర్వహించినట్లు కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తెలిపారు. యువ నాయకుడు నారా లోకేష్ బాబు కి మద్దతుగా కుప్పం మున్సి పాలిటీ పరిధిలోని పాతపేట కుప్పం చెరువు కట్టమీద నుండి తంబిగానపల్లి చంద్రన్న అగ్రికల్చర్ మార్కెట్ వరకు టీడీపీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించామని నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయ వంతంగా కొనసాగాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.

## టీడీపీ శ్రేణుల ర్యాలీ

**విశాలాంధ్ర- చిత్తూరు:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాద యాత్ర 200 రోజులకు చేరు కున్న సందర్భంగా యాత్రకు సంఘీభావంగా చిత్తూరు లో టీడీపీ నేతలు, కార్యకర్తలు గురువారం ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీ జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి ఓవర్ బ్రిడ్జి మీదుగా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, టిడిపి నేతలు మోహన్ రాజ్, నేతలు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో పౌర్ణమి పూజలు

**విశాలాంధ్ర- పులిచెర్ల కల్లూరు:** పులిచెర్ల మండలం బండారు వారి పల్లి కురవ పల్లె కోదండరామ స్వామి ఆల యం, దేవళం పేట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం గురువారం పౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయా ఆలయాల్లో ఉదయం స్వామి వార్లకు అభిషేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంక రించారు. అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజ శేఖర్ దీక్షితులు, అనంత కుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.

## బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా పంపిణీ

**విశాలాంధ్ర- చిత్తూరు:** ఏను గు దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబానికి గురువారం చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు అటవీ శాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి ప్రభుత్వ పరంగా పది లక్ష ల రూపాయలు ఎక్స్‌గ్రేషియాను అందించారు. బుధవారం ఒంటరి ఏనుగు దాడిలో మరణించిన 190 రామాపురం వాసులు సెల్వి , వెంకటేష్ ల పార్థివదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును డీఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి తో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగు దాడిలో భార్యాభర్తలు మరణించడం విచారకరమని వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

## గణనాథుని సేవలో సమాచార శాఖ మంత్రి

**విశాలాంధ్ర - ఐరాల :** స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబం ధాల శాఖ, సినిమాటోగ్రఫీ, వెను కబడిన తరగతుల శాఖ మంత్రి వెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కుటుంబ సభ్యు లతో గురువారం కాణిపాకం విచ్చేశారు. వీరిని ఆలయ అధికారులు స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పిం చారు. వేద పండితులచే ఆశీర్వ చనం, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసా దాలు అందజేశారు. అనంతరం దేవస్థానం అతిథి గృహం వద్ద మంత్రిని మర్యాద పూర్వకంగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి కలిశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్‌వి కృష్ణారెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ బాషా, తహశీల్దారు సుశీల, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్సై శ్రీనివాసులు, ఆలయ పర్యవేక్షకులు రంగస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు, సమాచార శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పనితీరు మార్చుకోండి..

- అధికారులకు ఎంపిపి ఆదేశం
- వెదురుకుప్పంను తిరుపతి జిల్లాలో కలపాలని తీర్మానం
- మండల సర్వసభ్యసమావేశంలో సభ్యుల రగడ

**విశాలాంధ్ర-వెదురుకుప్పం:** ప్రభుత్వ శాఖల అధికారులు పనితీరు మార్చుకోవాలని ఎంపిపి నాగరాణి అన్నారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయం సమావేశపు హాలులో సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా మూడునెలల కొకసారి నిర్వహించే సర్వసభ్యసమావేశానికి కొందరు అధికారులు హాజరు కాకపోవడం, రెవెన్యూ శాఖ పనితీరు పై మండిపడ్డారు. జడ్పిటిసి సు కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు గత సర్వసభ్యసమావేశం లలో సభ్యులు చెప్పిన సమస్యలు పరిష్కారం చూపలేదని వాపోయారు. దేవరగుడి పల్లి లో పశువులకు క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలని స్థానిక సర్పంచ్ ఆశీర్వాదం పశువైద్యులు రాజేష్ దృష్టికి తెచ్చారు. ఇంటి నిర్మాణాలు జరిగినా బిల్లులు చెల్లించడం లేదని గొడుగుచింత సర్పంచ్ నక్కా బాబు అన్నారు.కోఆప్షన్ సభ్యులు వెంకటేష్ మాట్లాడుతూ గత సర్వ సభ్యసమావేశం లలో ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలు అధికారులు పరిష్కారం చూపడం లేదని ఇలాంటి సమా వేశాలు ఎందుకని అసహనం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీ లకు ప్రభుత్వం అభివృద్ధి నిధులు కేటాయించలేదని అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయని బ్రాహ్మణ పల్లి సర్పంచ్ బట్టే శిరీషా ప్రశ్నించారు. చేపల చెరువులు వేలం నిర్వహించాలని కొమర గుంట సర్పంచ్ దాక్షయని సభ దృష్టికి తీసు కొచ్చారు. అప్రకటిత కరెం టు కోతల వల్ల పల్లెల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెదురుకుప్పం సర్పంచ్ శిల్ప విద్యుత్ శాఖ అధికారులను నిలదీశారు. అనంతరం వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలంటూ గంటావారి పల్లి సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి ప్రతిపాదన చేశారు. దీంతో సమావేశం లోని సభ్యులు అందరూ ఏకగ్రీవంగా తీర్మా నాన్ని ప్రవేశపెట్టారు. ఆమోదించిన తీర్మానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపిపి నాగరాణి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రావు,డిప్యూటీ తహశీల్దార్ కోమల, ఈఓఅండ్ పిఆర్డీ పురుషోత్తం, ఇరిగేషన్ ఏఈ మంజుల,వ్యవసాయ అధికారి వనిత,ఎపిఓ ఇందు,ఎపియం కవిత, అంగన్‌వాడీ సూపరువైజరు శకుంతల, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రవీణ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

**విశాలాంధ్ర-పలమనేరు:** చంద్రబాబుతోనే మనందరి భవిష్య త్తుకు గ్యారెంటీ అని పలమనేరు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం 'భవిష్యత్తుకు గ్యారెంటీ - ఇది బాబు గ్యారెంటీ' అనే కార్యక్రమం పై నియోజకవర్గ చర్చ వేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఏఎంసి చైర్మన్ రామచంద్ర నాయుడు మాట్లాడుతూ టీడీపీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'భవిష్యత్తుకు గ్యారెంటీ - ఇది బాబు గ్యారెంటీ' కార్యక్రమాన్ని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు నెల రోజులపాటు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఓటర్ వెరిఫికేషన్, బాట్ యాప్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి, గంగవరం, పలమనే రు, పెద్దపంజాణి మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడ్, నాగరాజు రెడ్డి, ఆనంద, నాయకులు గిరి, నాగరాజు, చాంద్ బాషా, సుబ్రమణ్యం గౌడ్, గణేష్, ఈశ్వర్ గౌడ్, వెంకటరమణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శివకుమారి పాల్గొన్నారు.

## రైతులకు రాయితీ ఉలవలు పంపిణీ

**విశాలాంధ్ర - రామకుప్పం :** మండల పరిధి లోని ముద్దనపల్లి పంచాయతీ రైతుభరోసా కేంద్రంలో సర్పంచ్ సికిందర్ గురువారం రైతులకు ఉలవ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 80 శాతం రాయితీ పై ఉలవ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోందని ఉలవ విత్తనాలు బయట నుంచి కొనుగోలు చేయాలంటే ఒక కిలో విత్తనాలు సుమారు 108 రూపాయలుగా ఉందని అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను 80 శాతం రాయితీపై ఒక కిలో కేవలం 21 రూపాయలకే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తమవెంట తెచ్చుకుని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి మంజునాథ్, రైతు భరోసా కేంద్ర అధికారి కోమల, రైతులు, పాల్గొన్నారు.

## ఘనంగా మదర్ థెరిసా ఎంసీఏ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**విశాలాంధ్ర-పలమనేరు:** పట్టణ సమీపంలోని మదర్ థెరిసా ఎంసీఏ కళాశాలలో 22- 23 సంవత్సరానికి గ్రాడ్యుయేషన్ దినోత్సవం వీడ్కోలు సమావేశం నిర్వహించినట్లు 22-23 సంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన ఎంసీఏ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే సందర్భంగా కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్లు మంజూరు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంసీఏ విద్యార్థులకు గత రెండు సంవత్సరాలలో కోర్సుకు సంబంధించిన విషయంతో పాటు వారితో నైపుణ్యాన్ని పెంచడానికి వివిధ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశామని ఈ విజ్ఞానంతో క్యాంపస్ సెలక్షన్‌లో చాలా మంది ఉద్యోగాలు తెచ్చుకున్నారని కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు, చైర్మన్ ఎంఆర్ సునీల్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమార్, హెచ్ఓడి ప్రభాకర్ నాయుడు, అధ్యాపకులు విద్యార్థులు పా ల్గొన్నారు.

## బాలుడిని పరామర్శించిన వైసీపీ నేత

**విశాలాంధ్ర - గంగాధరనెల్లూరు:** మండలం వింజం ఎంపీటీసీ హనీఫ్ సాహెబ్ మనవడు షాకీర్ ను వైసీపీ సీనియర్ నాయకులు నూకతోటి రాజేష్ పరామర్శిం చారు. షాకీర్ కొన్ని నెలలపాటు అనా రోగ్యం బారిన పడ్డా డు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్స చేసు కున్న ఎంపీటీసీ మనవడు షాకీర్ ను ఆవులూరు లోని వారి ఇంటికి వెళ్లి వైసీపీ నాయకులు నూకతోటి రాజేష్ పరామర్శించి వారిలో ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో వింజం గ్రామ పంచాయతీ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం: మున్సిపల్ చైర్మన్

**విశాలాంధ్ర - కుప్పం :** కుప్పం మున్సిపాలిటీలో కురిసిన వర్షానికి రామ చంద్ర రోడ్ యాక్సిస్ బ్యాంక్ పక్క వీధిలో పెద్ద చెట్టు కుప్పకూలి పక్క బిల్డింగ్ పైన పడిపోయింది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టరు సుధీర్ వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందితో, అగ్నిమాపక సిబ్బందితో చెట్టును ఇంటి పైనుండి జెసిబి సహాయంతో రోడ్డుపై నుంచి ట్రాఫిక్ కు ఆంతరాయం లేకుండా తొలగించారు. ఆ ఇంటి యజమాని, స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తొలగించారు. వెంటనే స్పందిం చిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. అదృష్ట వశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదని సంతోషిస్తున్నామని, కుప్పం మున్సిపల్ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా మేం అందుబాటులో ఉంటామని మున్సిపల్ చైర్మన్ డాక్టరు సుధీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, రెస్కో సిబ్బంది పాల్గొన్నారు.

## సుబ్రమణ్యంరెడ్డి ఇంటికి డిప్యూటీ సీఎం

**విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు :** మండలంలోని కలిజవేడు గ్రామానికి చెందిన వైఎస్సార్ టీయుసి జైన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి కొత్త ఇల్లు నిర్మాణం పూర్తయింది. కాగా ఆయన బుధవారం ఉదయం కొత్త ఇంట్లోకి పూజలు చేసి వెళ్లారు. దీంతో డిప్యూటీ సీఎంను ఆ నేత గృహ ప్రవేశంకు ఆహ్వానించగా, వివిధ కార్యక్రమాలు వల్ల బుధవారం రాలేకపోయారు. డిప్యూటీ సిఎం నారాయణస్వామి గురువారం కలిజవేడులో సుబ్రమణ్యంరెడ్డి ఇంటికి వెళ్ళి సత్యనారాయణ స్వామికి పూజలు చేసి, అనంతరం వాణిశ్రీ సుబ్రమణ్యంరెడ్డి దంపతులకు డిప్యూటీ సీఎం శాలువ కప్పి అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జైన్ ఫ్యాక్టరీ మేనేజర్ షమీర్ శర్మ, పెనుమూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి శ్రేణుల ధర్నా

- జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడుపై పోలీసులు చేయి చేసుకున్నారని వాగ్వాదం

**విశాలాంధ్ర- బంగారుపాళ్యం:** మండల కేంద్రమైన బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి శ్రేణులు పూతలపట్టు నియోజకవర్గ ఇన్చార్జ్ మురళీమోహన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు పై పోలీసులు చేయి చేసుకున్నారంటూ నాయకులు కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశం జరుగుతుండగా 170 గొల్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రకాష్ నాయుడు సమావేశానికి హాజరవుతూనే గ్రామ పంచాయతీలో కేంద్రం జమ చేసిన నిధులు ఎవరో కాజేశారని గ్రామాలను ఎలా అభివృద్ధి చేయాలంటూ భిక్షాటన చేయడం ప్రారంభించాడు. దీంతో సమీపంలోనే ఉన్న సీఐ నాగరాజరావు ఆయనను చొక్కా పట్టుకొని సభ నుండి లాక్కుంటూ వచ్చి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రకాష్ నాయుడు తీవ్రమైన అస్వస్థతకు గురి కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సీఎం సి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం టిడిపి నాయకులు కార్యకర్తలకు తెలియడంతో పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు .అనంతరం పలమనేరు డి.ఎస్.పి సుధాకర్ రెడ్డి అక్కడి చేరుకుని టిడిపి నాయకులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు నిరసన తెలిపే హక్కు ఒక సర్పంచ్ కు ఉండదా? అని టిడిపి ఇన్‌చార్జి మురళీమోహన్ డీఎస్పీ తో వాగ్వివాదానికి దిగారు. వైఎస్ఆర్సిపి నాయకులకు తొత్తులుగా పోలీసులు వ్యవహరిస్తుండడం బాధా కరమన్నారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో చిత్తూరు నుండి పలమనేరు నుండి అదనపు బలగాలు బంగారుపాళ్యం కు చేరుకున్నాయి. అనంతరం డి.ఎస్.పి టిడిపి నాయకులతో మాట్లాడుతూ జరిగిన ఘటనపై రెండు రోజుల్లోపు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసు కుంటామన్నారు. దీంతో శాంతించిన టిడిపి శ్రేణులు అక్కడి నుండి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మండల టిడిపి అధ్యక్షుడు ఎంపీ జయప్రకాష్ ,జిల్లా నాయకులు కోదండ యాదవ్, వల్లేరు అమరనాథ్ నాయుడు, వెంకటేశ్వర చౌదరి, లోకనాథ నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

## బోధనా పద్ధతులపై ప్రత్యేక అవగాహనా

విశాలాంధ్ర - తిరుపతి: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల (లెక్చరర్ గ్యాలరీ)లో యంబిబిఎస్ 2023-24 (విద్యా సంవత్సరానికి) అడ్మిషన్ పొందిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు వైద్య కళాశాలలో బోధనా పద్ధతులు పై ప్రత్యేక అవగాహనా కల్పించానున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు కార్డియాలజి విభాగంలో అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించిన విభాగాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి , ఈవో ఎవిధర్మారెడ్డి , జెఈఓ సదా భార్గవి , స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టరు ఆర్.వి. కుమార్ పాల్గొంటారు.

## వైభవంగా మహా భారత ఉత్సవాలకు ధ్వజారోహణం

విశాలాంధ్ర -రామచంద్రాపురం : మండలంలోని ఎన్ ఆర్ కమ్మ పల్లిలో 57 వ మహా భారత ఉత్సవాలకు గురువారం వేకువజామున వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు. అలయ ధర్మకర్త రమేష్ బాబు, గ్రామస్తుల సమక్షంలో ప్రధాన అర్చకులు హరి ఆచార్యులు బృందం శాస్త్రోక్తంగా పలువురికి గణాచార్యులు, బటాచార్యులుగా కంకణ ధారణ చేశారు. వేకువజామున 2.30 గంటలపైన మిథున లగ్న మందు ధ్వజారోహణ నిర్వహించారు. శ్రీకృష్ణ ద్రౌపది మాత సమేత పాండవుల విగ్రహాలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ మధ్యాహ్నం జియస్ కె సీతా లక్ష్మి భగవాతారిణిచే మహాభారత విశిష్టత, వ్యాస జననం, శ్రీ కృష్ణ జననం, కంసక వధ ఘట్టాలను హరి కథ గానం చేయబడింది. హార్మోనిస్టుగా శ్రీనివాసులు, సోమశేఖర్, వయలనిస్టుగా కామేష్ హరి కథను రక్తికట్టించారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర కళానాట్యమండలి వారి మేనేజర్ మంజుల శ్రీనివాస్ డాన్సర్ నాగరాజు బృందం చే శ్రీకృష్ణ జననం, కంసక వధ పౌరాణిక నాటకం ప్రదర్శింపబడింది. లెక్కల మార్కొండమ నాయుడు మునెమ్మల కుటుంబం అమ్మవారికి వడిబాల సాంగెం సమర్పించారు. ధర్మకర్త రమేష్ బాబు కుటుంబ సభ్యులు ధ్వజారోహణ కార్యక్రమంకి ఉభయదాతలుగా వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## తాగునీరు పైపులైన్ కి మరమ్మతులు

### - విశాలాంధ్ర వార్తకు స్పందించిన అధికారులు

విశాలాంధ్ర- చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట,కోగిలి క్రాస్ రోడ్

మధ్య భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే తాగునీటి పైపులైను పగిలి నీరు వృథాగా పోతుండడంతో మంగళ వారం విశాలాంధ్ర పత్రికలో ప్రచురించిన 'వృథాగా పోతున్న తాగు నీరు -స్పందించని అధికారు లు' అనే కథనానికి స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తక్షణం పైపులైన్ మెయింటినెన్స్ కాంట్రాక్టర్ కి పైపులైన్ మరమ్మతులు వెంటనే చేయాలని ఆదేశాలు చేయడంతో బుధవారం లీక్ అవుతున్న పైప్ లైన్ రిపేరు చేసి తాగునీరు వృథాను అరికట్టారు.

## సీపీఎం సంతకాల సేకరణకు విశేష స్పందన

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా సీపీఎం గురువారం చేపట్టిన సంతకాల సేకరణకు విశేష స్పందన లభించింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని పెండ్లిమండపం వద్ద గురువారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది ప్రజలు స్వచ్చందంగా తరలి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అను సరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. అనంతరం అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ, జగన్ పాలన పట్ల ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో సీపీఎం సంతకాల సేకరణలో తేట తెల్లమైం దన్నారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనలో కార్పొరేట్ల జపం చేశారే తప్పా, ఒక్కటైనా ప్రజాపయోగ్యమైన సంస్కరణ తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. మోడీ నిరంకుశ వైఖరి కారణంగా దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగి పోయిందన్నారు. నిత్యవసరాలు ఆకాశాన్నంటడంతో ఏం కొనలేనీ, ఏం తినలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీల పరిస్థితి చెప్పనలివి కాదన్నారు. మోదీతో చేతులు కలిపి జగన్ 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచా డంటూ ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి ప్రజా వ్యతిరేక బిల్లుకు జగన్ ప్రభుత్వం మద్దతిస్తుండడం బాధాకరమన్నారు. వీట న్నిటిపై సీపీఎం వివిధ రూపాల్లో చేపట్టబోయే ప్రజా ఉద్యమాలకు ప్రజలు మద్దతుగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, రాజా, వెలివేంద్రం, గురునాథం పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ సంస్కృత దినోత్సవం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంస్కృత శాఖ

ఆధ్వర్యంలో ప్రపంచ సంస్కృత దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సంస్కృత అధ్యాపకురాలు డాక్టర్ జె. పద్మమాలిని మాట్లాడుతూ ప్రాచీన భారతీయ భాషపై అవగాహన, ప్రచారం, పునరుద్ధరణ కోసం సాంస్కృతిక దినోత్సవాన్ని జరుపుకుంటారని, ఈ రోజునే ప్రపంచ సంస్కృత దినోత్సవం లేదా విశ్వ సంస్కృత దినోత్సవం అని కూడా అంటారని తెలిపారు. ప్రపంచ సంస్కృత దినోత్సవం లేదా సంస్కృత దివాస్ ను 1969 సంవత్సరంలో తొలిసారి జరుపుకున్నారని, ఇది ప్రాచీన భారతీయ భాషపై అవగాహన, ప్రచారం, పునరుద్ధరణ కోసం జరుపుకుంటారన్నారు. మనకు తెలిసినట్టుగా హిందూ సంస్కృతిలో పూజ, యంత్రాలను సంస్కృతంలో చదువుతారు. సంస్కృత భాష దాదాపు 3500 సంవత్సరాల క్రితం భారతదేశంలో ఉద్భవించిందని నమ్ముతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. రాజ శేఖర్, సంస్కృత అధ్యాపకురాలు డాక్టర్ జె. పద్మమాలిని, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్రకు మద్దతు

విశాలాంధ్ర- తిరుపతి: నియో జక వర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ

ఆధ్వర్యంలో 200 రోజులు పూర్తి చేసు కున్న నారా లోకేష్ బాబు యువగళం పాద యాత్రకు మద్దతుగా సంఘీభావ పాదయాత్ర నాలుగు కాళ్ల మండ పం నుండి తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ ఆఫీస్ వరకు సంఘీభావ ర్యాలీ చేసి తదుపరి మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్రీకాంత్ , తిరుపతి నియోజకవర్గ పరిశీలకులు సురేంద్ర కుమార్ , తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, కార్పొరేటర్, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, క్లస్టర్, యూనిట్ ఇంఛార్జీలు, నగర, మహిళా, యువత, విద్యార్థి, వార్డు కమిటీల సభ్యులు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేశారు.

## 3న వ్యవసాయ పాలిటెక్నిక్ అడ్మిషన్లుకు ఆఖరు

విశాలాంధ్ర -నారాయణవనం :మండల కేంద్రంలోని నారాయణవనం ఆచార్య ఎం జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నారాయణ వనం లోని ఎస్ వి ఎస్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలాంటి ప్రవేశ పరీక్షలు లేకుండా ఈ నెల 3వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ తెలిపారు. 2023- 2024 సంవత్సరం ప్రవేశం కోసం వ్యవసాయ డిప్లమా లో చేరుటకు 10 పాసైన విద్యార్థులు, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6300272844 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న మంత్రి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమం, సినిమాటో గ్రఫీ, ఐఅండ్‌పిఆర్ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన తల్లి జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దర్శనార్థమై కుటుంబ సభ్యులతో ఆలయానికి విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, ఐఅండ్‌పిఆర్ మంత్రిత్వ శాఖ చెల్లు బోయిన వేణు గోపాల కృష్ణకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, దేవస్థానం అధికారులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. దర్శన అనంతరం గురు దక్షిణామూర్తి వద్ద శేషవస్త్రంతో సత్కరించి వేదపండితులచే ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త మండలి సభ్యులు బుల్లెట్ జై శ్యామ్, దేవస్థానం అధికారులు ఏఈఓ సతీష్ మాలిక్, సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్, పి ఆర్ ఓ నాగభూషణం నాయక్, చైర్మన్ సిసి సుదర్శన్ రెడ్డి, బీసీ సంక్షేమం శాఖ అధికారులు, ఐఅండ్‌పిఆర్ అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర- తిరుపతి: తిరుపతి నగరం ఓటర్ల జాబితాలో తొలగించిన ఓటర్ల గృహాలను గురు వారం మధ్యాహ్నం తిరు పతి నియోజక వర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఎన్నికల అధికారులతో కలసి పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి నియోజక వర్గంలోని తుడా కార్యాలయం సమీపంలో గల వినాయక నగర్ లోని గృహాలను కమిషనర్ స్వయంగా వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ బూత్ లలో డబుల్ ఎంట్రీ అయిన, చనిపోయిన, మరొక ప్రాంతానికి తరలిపోయిన, వలస పోయిన తదితర కారణాల వలన తొలగించబడిన ఓటర్ల ను పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద పెయింట్ తో వేసిన ఎన్నికల, నగరపాలక సంస్థ డోర్ నంబర్లను పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలని, ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట తహశీల్దారు వెంకటరమణ, ఈడిటి జీవన్ కుమార్, బిఎల్‌ఓలు ఉన్నారు.

## శివ శివా.. సిమెంట్ రాళ్లతో నిర్మాణమా... !

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : సిమెంట్ రాళ్లతో నిర్మాణం చేపట్టంపై

పలువురు భక్తులు నిర్మాణం పట్ల అస హనం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళ హస్తీశ్వ రాల యంలో అపచా రాలు జరిగి పో తూనే ఉన్నా యన్న ఆరోపణలు వినిపి స్తూనే ఉన్నాయి. ఆలయ నిర్మాణం జరిగినా, మరమ్మ తులు అయి నా కొన్ని పద్ధతులు పాటిం చాల్సి ఉంటుంది. శిల్ప కళకు సంబంధిం చిన ఆచారాలు, సంప్ర దాయాలను మరవకూడదు. ఆలయ ఆవరణ లోని కాళికాదేవి మండపం చుట్టూ ఉన్న గోడలను దేవస్థానం అధికారులు తొలగించారు. ఆధునికీకరణ పేరుతో సిమెంట్ రాళ్లతో నిర్మాణం చేస్తున్నారు. బూడిద కలిపిన సిమెంట్ రాళ్లను వాడడం ఏ శిల్ప సంప్రదాయంలో ఉందో ఇంజనీరింగ్ అధికారులకే తెలియాలి.

## 7న వేణుగోపాలస్వామి ఆలయంలో గోకులాష్టమి వేడుకలు

విశాలాంధ్ర- తిరుపతి: తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా వున్న వేణుగోపాలస్వామి ఆలయంలో సెప్టెంబరు 7వ తేదీ గోకులాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు వేణుగోపాల స్వామి వారి మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు వీధి ఉత్సవం, 8 గంటలకు స్వామివారికి గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు.

## ప్రారంభోత్సవానికి ఆడిటోరియం సిద్ధం: కమిషనర్

విశాలాంధ్ర- తిరుపతి: తిరుపతి నగరం తిరుపతి నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఆడిటోరియం ను సెప్టెంబర్ 3న ప్రారంభించనున్నామని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎం.డి హరిత అన్నారు. తుడా కార్యాలయం వెనుక నిర్మాణంలో వున్న ఆడిటోరియం పనులను గురువారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు 40 కోట్ల రూపాయలతో 600 మంది సిటింగ్ కెపాసిటీతో కార్యక్రమాలు వీక్షించేందుకు వీలుగా ఆడిటోరియం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆర్ట్ స్టూడియో, డిజైన్ స్టూడియోలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఆడిటోరియం, ఆర్ట్ స్టూడియో పనులు పూర్తి అయ్యాయని, సెప్టెంబరు 3వ తేది టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నామన్నారు. ఆడిటోరియం అందుబాటులోకి రావడంతో సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించు కోవడానికి ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. చిన్న చిన్న పనులు శనివారం లోపు పూర్తి చేసి ఆదివారం ప్రారంభోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అన్ని పనులు సక్రమంగా జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ దేవిక, ఏఈ కాం సంస్థ ప్రతినిధి బాలాజీ ఉన్నారు.

## మహా జాబ్ మేళాలో 20 మంది విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - పాకాల : మహా జాబ్ మేళా ద్వారా పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఉద్యో గాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహిద్దిన్ బాష తెలిపారు. గురువారం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల లో కళాశాల విద్య ఆధ్వర్యంలో 32 కంపెనీలకు చెందిన ప్రతినిధులు నిర్వహించిన మహా జాబ్ మేళా కార్యక్రమానికి పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి 60 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 20 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. తమ కళాశాలలోని జెకేసి సమన్వయకర్త రమేష్ కుమార్ ఇచ్చిన శిక్షణ విద్యార్థులకు బాగా ఉపయోగ పడిందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మోహన్ కుమార్ ,వినోద్, మాధవి మోహన్ బేహారా పాల్గొన్నారు.

## యువగళం సంఘీభావ ర్యాలీ విజయవంతం

విశాలాంధ్ర -రామచంద్రాపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకుడు నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రామచంద్రాపురంలో చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో భారీ ఎత్తున సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. రాయల చెరువు కట్టదిగువ ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీని ప్రారంభించారు. సంజీవరాయపురం, బలిజపల్లి ,పివిపురం, గంగమాంబాపురం, రామిరెడ్డి పురం, గంగిరెడ్డి పల్లి, తోకగుట్ట ఇండ్లన, కమ్మ కండ్రిగ, మిట్టూరు, యస్‌టి కాలనీల మీదుగా రామచంద్రాపురం కూడలికి చేరుకుంది. అడగడుగున మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతించారు.దారి పొడవునా బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. దారిపొడవునా పూల వర్షంతో నిండి పోయాయి. తోక గుట్ట ఇండ్ల వద్ద మహిళలు రాఖీ కట్టి , ఎర్రనీళ్లతో దిష్టి తీసి వీర తిలకం దిద్దారు. రామచంద్రాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడలిలో కార్యకర్తలను ఉద్దేశించి పులివర్తి నాని ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణ కలిగిన గ్రామాలలో స్వార్థంతో విధ్వంసం చేస్తున్నారని వైసిపి నాయకులపైన విరుచుకుపడ్డారు. సహజ వనరులైన ఇసుక, గ్రావెల్ మట్టిని అక్రమంగా తరలించి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ప్రజలకు హాని కలిగించే ఫార్మస్యూటికల్ పరిశ్రమను రామచంద్రపురం మండలంలో పెట్టేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి పరిశ్రమ పెడితే పలు గ్రామాలు కలుషిత కోరల్లో చిక్కుకుని ప్రజలు అనారోగ్య భారినపడే ప్రమాదముం దన్నారు. ఫార్మా క్యూటీకల్ కంపెనీలు కట్టడానికి సత్యవేడు ప్రాంతంలో కావలసినంత భూములు ఉన్నాయని గుర్తు చేశారు మీరు నిజంగా ఇక్కడ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలంటే మరెన్నో పరిశ్రమలు ఉన్నాయని చెప్పారు. స్వార్థం కోసం ఇక్కడ ప్రాంతాలను కలుషితం చేసి దెబ్బతీయాలంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తల పైన అక్రమ కేసులుపెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు నా కార్యకర్తల కోసం తాను ఏమైనా చేయటానికి సిద్ధంగా ఉంటానని హెచ్చరించారు రాబోవు ఆరు నెలల కాలం ఎంతో ముఖ్యమైనదని కార్యకర్తలందరూ ఈ విషయాన్ని గుర్తించి అధికార పార్టీ ఆగడాలను అడ్డుకోవటానికి సిద్ధపడాలన్నారు. దొంగ ఓట్లను చేర్చనీయకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.మీవెంట తానున్నానని ఎవ్వరూ అధైర్య పడవద్దని నాని కార్యకర్తలకు భరోసా కల్పించారు. దారి పొడుగునా శాలువాలతో, హారతులతో, గజమాలలతో ఆహ్వానం పలికారు.కార్యకర్తల జోష్ తో మరింత జోష్ గా నాని వెంట నడుం బిగించి నాయకులు కార్యకర్తలు నడిచారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఆయా మండలపార్టీ అధ్యక్షులు కార్యదర్శులు వివిధ విభాగాల నాయకులు అభిమానులు, కార్యకర్తలు, యువత ,మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా



## ఎస్‌వి మ్యూజియంకి పురాతన వస్తువులు విరాళం

విశాలాంధ్ర- తిరుమల కల్చరల్: యుఎస్ఎలో ఉంటున్న వింజమూరి సంధ్య తిరుమలలోని ఎస్వీ మ్యూజియానికి లక్షల రూపాయలు విలువచేసే పురాతన వస్తువులను విరాళంగా అందజేశారు. వీటిని గురువారం తిరుమలలో ఈవో ఎవి.ధర్మారెడ్డి చేతులమీదుగా అందజేశారు. డాక్టరు వింజమూరి వరదరాజ అయ్యంగార్ ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు. వీరు టీటీడీ ఉత్సవాల్లో పలు ప్రదర్శనలిచ్చారు. అన్నమాచార్య ఉత్సవాలు ప్రారంభించిన నాటి నుండి ప్రముఖ సంగీత విద్వాంసులుగా ఉన్నారు. వీరు ఎంఎస్.సుబ్బలక్ష్మి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మతో కలిసి పనిచేశారు. వీరు ఉపయోగించిన, సేకరించిన వాటిలో తంబూరాలు, వేణువులు సంగీత పరికరాలతో, వారు పూజించిన పంచలోహ శ్రీ నమ్మాళ్వార్ విగ్రహం, చిన్న భగవద్గీత, వెండితో చేసిన శ్రీ వేంకటేశ్వరస్వామి, అమ్మవార్ల పటాలు, దంతపు నగిషీలు చెక్కిన కళాఖండాలు ఉన్నాయి. వీటిని ఆయన కుమార్తె శ్రీమతి సంధ్య మ్యూజియానికి అందించారు.

## టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటసుబ్బరాజు ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర- తిరుమల కల్చరల్:టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా గురువారం జి.వెంకటసుబ్బరాజు

తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని జేఈవో అందజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు లోకనాథం, గోవిందరాజన్ పాల్గొన్నారు.

## కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్‌లు అందించడం లేదు..

### - స్థానికుల ఇబ్బందులు పరిష్కరించాలి - సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: కుల ధృవీకరణ సర్టిఫికెట్లు సకాలంలో అందించడంలేదని , స్థానికులు

ఇబ్బందులు ఎదు ర్కొం టున్నారని వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వ ర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న జగనన్న చేయూత పథకం కి అప్లై చేసుకోవడానికి ఆగస్టు 31వ తేదీ చివ రి తేదీ అయినా కుల, ఆదాయం సర్టిఫికెట్లు మంజూరు చేయక పోవడంతో లబ్దిదారులు సచివాలయం చుట్టూ, ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. సచివాలయంలో అప్లై చేశామని, కాస్ట్, ఇన్‌కం తెస్తేనే చేయూత పథకానికి అర్హులని వారు చెబుతున్నారన్నారు. ఎమ్మార్వో కార్యాలయంలో తహశీల్దారు లేరని విజయవాడ హైకోర్టులో ఉన్నారని చెబుతున్నారన్నారు. ఈరోజు గాని క్యాస్ట్ ఇన్‌కం సర్టిఫికెట్లు అబ్దిదారులకు ఇవ్వకపోతే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకం జగనన్న చేయూత కి అర్హులు కాలేరన్నారు. లబ్దిదారులు నష్టపోతారని అధికారులు స్పందించి వెంటనే కుల, ఆదాయం సర్టిఫికెట్లు ఇవ్వాలని లేని పక్షంలో ఈ పథకానికి లబ్ది పొందని వారందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నష్ట పోయిన వారందరికీ సచివాలయం సిబ్బంది, రెవెన్యూ అధికారులే పూర్తి బాధ్యత వహించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, వడివేలు, పరిమళ, ఆదిలక్ష్మి ,వరాలు పాల్గొన్నారు.

## తెలుగు మహిళల సేవలు అభినందనీయం : లోకేష్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగు మహిళల సేవలు అభినందనీయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రాష్ట్రంలోని 25 పార్లమెంటు తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాళ్లను ప్రస్తుతం యువగళం పాదయాత్ర జరుగుతున్న జంగారెడ్డిగూడెం వద్దకు ఆహ్వానించారు. అక్కడ తెలుగు మహిళా పార్లమెంటు అధ్యక్షురాళ్లు అందరూ నారా లోకేష్ కు రాఖీ కట్టారు. రాఖీ కట్టిన తెలుగు మహిళలు అందరికీ నారా లోకేష్ పట్టు చీర, రవిక, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. వారందరి ఆశీర్వాదం ఆయన తీసుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... నిర్బంధాల మధ్య తెలుగు మహిళలు చేస్తున్న పోరాటాలను వర్ణించడానికి అక్షరాలు చాలవన్నారు. వైసీపీ ప్రభుత్వం తెలుగు మహిళలపై అక్రమ కేసులు బనాయించడం, మానసికంగా వేధించడం చేసినా ఏమాత్రం వెనుకంజ వేయకుండా పోరాట పటిమ కనబరుస్తున్నారని నారా లోకేష్ కొనియాడారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరిగిన సమయంలో ప్రభుత్వం స్పందించే విధంగా తెలుగు మహిళలు పోరాటం చేస్తున్నారన్నారు. తెలుగు మహిళల పోరాటం ఇతరులకు స్ఫూర్తిగా ఉంటోందన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మహానాడులో ప్రకటించిన 'మహాశక్తి' పథకం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తెలుగు మహిళలు పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న తెలుగు మహిళలకు భవిష్యత్తులో మంచి గుర్తింపు ఇస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగు మహిళలకు మంచి ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించడానికి తెలుగు మహిళలు కీలక పాత్ర పోషించాలని నారా లోకేష్ కోరుకున్నారు. ఇందుకు తెలుగు మహిళలు అందరూ అంగీకరించారు. టీడీపీని అధికారంలోకి తెస్తామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష, తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల వర్తింపజేసి పేద కుటుంబాలను ఆదుకోవాలి

### రెవెన్యూ అధికారులకు సర్పంచులు, గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర- సత్యవేడు: శ్రీసిటీ పరిధిలోని పలు ప్రాంతాల నిరుపేద కుటుంబాలకు ఉజ్వల పథకం వర్తింపు అయ్యేలా చూడాలని శ్రీసిటీ ప్రాంతంలోని పలువురు సర్పంచులు,గ్రామస్తులు విన్నవించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గ్రామస్తులు పలువురు రెవెన్యూ డిటి రవిచంద్రబాబును కలిసి ఉజ్వల పథకం,గ్యాస్ ఇబ్బందులను వివరించారు.శ్రీసిటీ పరిధిలోని ఆరూరు,మల్లవారి పాలెం ఈస్ట్,చెరివి,మల్ల వారి పాలెం వెస్ట్,ఇరుగుళం పంచాయతీల పరిధిలో అనేకమంది ఇంతవరకు వంట గ్యాస్ కనెక్షన్లు పొందలేక అవస్థలు పడుతున్నట్టు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.బియ్యం రేషన్ కార్డులు ఉన్నవారు డిపాజిట్లు కూడా చెల్లించలేని పరిస్థితిలో వంటగ్యాస్ కనెక్షన్ పొందలేకపోతున్నారు అన్నారు.వీరందరికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల పథకం ద్వారా వంట గ్యాస్ కనెక్షన్లు ఇప్పించాలని కోరారు.గతంలో కూడా ఈ పథకంలో గ్యాస్ కనెక్షన్ పొందడానికి కొన్ని గ్యాస్ ఏజెన్సీలకు దరఖాస్తులు చేసుకున్న ఫలితం లేకపోయింది అన్నారు.ఏజెన్సీ నిర్వాహకుల నుంచి సరైన న్యాయం జరగలేదని వారు వాపోయారు.మరి కొందరు డీలర్లు ప్రధానమంత్రి మోడీ నుంచి ఆదేశాలు రాలేదంటూ వెటకారంగా సమాధానం చెబుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణం గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి బియ్యం కార్డు ఉన్న నిరుపేద కుటుంబాలకు ఉజ్వల పథకం వర్తింప చేయాలన్నారు. ఇటీవల ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉజ్వల పథకం కింద 75 లక్షల గ్యాస్ కనెక్షన్ ఇవ్వడానికి క్యాబినెట్ ఆమోదించిన విషయాన్ని కూడా రెవెన్యూ అధికారుల దృష్టికి సర్పంచులు తీసుకువచ్చారు.ఈ మేరకు శ్రీసిటీ ప్రాంతాల్లోనే సర్పంచులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు.దీనిపై రెవెన్యూ డిటి రవిచంద్రబాబు స్పందిస్తూ సమస్యను తహసిల్దారు షేక్ జరీనా దృష్టి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఇందుకు సంబంధించి త్వరలోనే గ్యాస్ డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉజ్వల పథకం కింద అర్హులకు న్యాయం జరిగే విధంగా

చూస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దీంతోపాటు శ్రీసిటీ పరిధిలో కూడా గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటుకు అధికారులు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ పరిధి వైసిపి నాయకులు కమల్, సన్యాసయ్య, పరంధాం, సంజయ్ సర్పంచ లు అలిమేలు,పార్వతీ సన్యాసయ్య,శేఖర్ పాల్గొన్నారు.